క్లుప్తంగా

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ధర్నా



రాయికల్‌లో ర్యాలీగా వెళ్తున్న ఆర్యవైశ్యులు

రాయికల్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాయికల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు చింత శివకుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ స్పందించి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నిరుపేద వైశ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చిలువేరి వెంకటరమణ, కోశాధికారి చంద జనార్దన్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఫింగర్‌ప్రింట్స్ ఏఎస్సైకి ఎస్పీ అభినందన



ఏఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కిరణ్ ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఫింగర్ ప్రింట్ ఏఎస్సైగా ఎంపిక కాగా, ఎస్పీ ఎగ్గడి భాస్కర్ బుధవారం కిరణ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టుదలతో చదివితే విజయం సాధించవచ్చని, ప్రతి ఒక్కరు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు.


రోడ్లకు మరమ్మతులు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: ఇటీవల కురిసిన వర్షాలకు కథలాపూర్ మండలంలో కోతకు గురైన రోడ్లను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. 'రోడ్డు ప్రమాదకరంగా ఉంది నెమ్మదిగా వెళ్లండి.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రమాదకరంగా ఉంది మార్చేద్దాం' అని ఫ్లెక్సీలు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. మండలంలో కథలాపూర్ మోడల్‌స్కూల్ రోడ్డు, తాతమ్మ ఒర్రె, ఇప్పపెల్లి శివారులో మెయిన్ రోడ్డు కోతకు గురైందని అక్కడే నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, నాయకులు పులి హరిప్రసాద్, తొట్ల అంజయ్య, కల్లెడ గంగాధర్, ధనుంజయ్‌రెడ్డి, ఆకుల సంతోష్, మోయిన్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం



మధ్యాహ్నభోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్

మల్లాపూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ వీర్ సింగ్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్‌ను యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేష్, సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, హెచ్‌ఎం శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఆర్‌ఐలు రాజేష్, సురేష్, బడే బాలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గృహలక్ష్మి సర్వే పరిశీలన

రాయికల్: మండలంలోని భూపతిపూర్, ఒడ్డెలింగాపూర్య మంక్యానాయక్ తండాల్లో జరుగుతున్న గృహలక్ష్మి సర్వేను బుధవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని కోరారు.

అటకెక్కిన 'యంత్రలక్ష్మి'

- ఐదేళ్లుగా రైతుల ఎదురుచూపులు
- 2018 నుంచి బంద్
- రైతులకు ఆర్థికభారం



దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

బుగ్గారం: వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించి రైతులకు సాగు వ్యయం, శ్రమని తగ్గించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 2014–15 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన యంత్రలక్ష్మి పథకం నాలుగేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. గతంలో వేలాది మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా కొద్దిమందికే సబ్సిడీ ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు అందాయి. దీంతో మరికొంత మంది అర్హులైన రైతులు ఈ పథకం మళ్లీ ఎప్పుడు ప్రారంభమౌతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సబ్సిడీపై వివిధ రకాల పరికరాలు

యంత్రలక్ష్మి పథకంలో భాగంగా భారీ యంత్రాలైన వరినాటు మిషన్లు, వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు, గడ్డి చుట్టే యంత్రాలు, రోటవేటర్లు, దమ్ము చక్రాలు, కల్టివేటర్లు,నాగళ్లు, మినీ ట్రాక్టర్లు వంటి వ్యవసాయ పరికాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించారు. ఎస్సీ,ఎస్టీ రైతులకు 95 శాతం రాయితీపై అందించడంతో ఈ పథకానికి మంచి స్పందన వచ్చింది. అనేక మంది రైతులు యంత్రాల కొనుగోలుకు ఆసక్తి చూపారు. ఈ పథకంలో భాగంగా జగిత్యాల జిల్లాలో 2018 వరకు మొత్తం 20786 పనిముట్లను రైతులకు అందించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. 31.50 కోట్ల విలువైన యంత్రాలను సబ్సిడీపై అందించారు. రైతుల డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో బడా రైతులకు, పైరవీ ఉన్నవారికే దక్కినట్లు విమర్శలొచ్చాయి. కొన్ని సందర్భాలలో వ్యవసాయంతో సంబంధం లేని వారికి సైతం ట్రాక్టర్లు అందినట్లు ఆరోపణలున్నాయి. ఈ పథకం ద్వారా పొందిన ట్రాక్టర్లు పూర్తిగా వ్యవసాయ పనులకే ఉపయోగించాల్సి ఉన్నా కొంతమంది అక్రమ ఇసుక రవాణాతో పాటు వ్యవసాయేతర పనులలో వినియోగిస్తున్నారు.

యాంత్రీకరణతో ప్రయోజనం

వ్యవసాయంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం,యంత్రాల వాడకం పెంచడం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి.ప్రస్తుత కూలీల కొరత అధికమవుతున్న దశలో యంత్రాల వినియోగంతో ఈ పరిస్థితులను అధిగమించవచ్చు.అధిక సబ్సిడీపై అందించడంతో రైతులంతా యాంత్రీకరణ వైపు మారడానికి అవకాశాలున్నాయి. ప్రస్తుతం యంత్రాలను కొనుగోలు చేయాలనుకునే రైతులు అధిక ధరలు వెచ్చిస్తూ బహిరంగ మార్కెట్‌లో వివిధ రకాల పరికరాలను కొనుగోలు చేయడం తలకు మించిన భారంగా తయారైందని వాపోతున్నారు.ఇకనైనా ప్రభుత్వం ఈ పథకాన్ని త్వరగా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

చిన్న పనిముట్లనైనా అందించాలి



రైతులకు వ్యవసాయంలో అధికంగా ఉపయోగపడే స్ప్రేయర్లు,కల్టివేటర్లు,మినీ ట్రాక్టర్లు,టార్పాలిన్లు, కలుపు తీసే పరికరాలు వంటి సూక్ష్మసేద్య పరికరాలనైనా ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తే రైతులకు ఎంతగానో మేలు చేకూరుతుంది.వీటి కోసం ఎంతో మంది రైతులు ఎదురు చూస్తున్నారు.బయట మార్కెట్‌లో రాయితీ లేకుండా పూర్తి ధరలను చెల్లించి కొనుగోలు చేయడం పేద రైతులకు భారంగా మారింది.

– నీలం నరేందర్, రైతు,ధర్మపురి

ఆదేశాలు రాగానే దరఖాస్తులు స్వీకరణ



యంత్రలక్ష్మి పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అర్హులైన రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తాం. యంత్రాల వినియోగం వలన అనేక ప్రయోజనాలు ఉండడంతో అనేక మంది రైతులు ఈ పథకం కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా సాగు వ్యయం,సమయం కలిసి వస్తాయి. కూలీల కొరత వంటి ఇబ్బందులు తొలగిపోతాయి.

పాక సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసమే పల్లెనిద్ర

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్





ఒడ్డెలింగాపూర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

రాయికల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే పల్లెనిద్ర రూపొందించామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్‌లో బుధవారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒడ్డెలింగాపూర్ గ్రామంలో మన పల్లె మన ప్రగతిలో భాగంగా రూ.27 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, అంతేకాకుండా తండాల్లో గ్రామపంచాయతీలను చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, సర్పంచ్ పాలకుర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ సహకారంతో చదువుకుని మంచి ఉద్యోగం సాధించి సీఎంఆర్‌ఎఫ్ కు రూ. లక్ష విరాళం అందించగా, బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రచనను సన్మానించారు.

జగిత్యాలలో మెరుగైన అభివృద్ధి

జగిత్యాల: జగిత్యాల గతంలో కంటే మెరుగైన అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పలు వార్డుల్లో పర్యటించారు. స్థానికులు సమస్యలు దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులను వెనువెంటనే పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు అండగా ఉంటాం

బీడీ కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో 8 జిల్లాల బీడీ టేకేదారులతో సమావేశం నిర్వహించారు.

బీఆర్‌ఎస్ పార్టీలో పలువురి చేరిక

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్, మంగేళ, తాళ్ళధర్మారం గ్రామాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు నారపాక రమేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణ మార్చటమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని చిన్నమెట్‌పల్లి, జోగిన్‌పల్లి, గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సర్పంచ్ దుంపాల నర్సు, ఎంపీటీసీ మాదురి, పీఏసీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు

కోరుట్ల: పట్టణ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ చొరవతో పట్లణ అభివృద్ధి కోసం రూ. 10 కోట్లు టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజురయ్యాయని ఆ నిధులతో పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, కమిషనర్ టి. రాజేశ్వర్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం రూ.10 కోట్లు

మెట్‌పల్లి: పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.10కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నిధులతో చేపట్టే వివిధ పనులకు సభ్యులు ఏకగ్రీవంగా అమోదం తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ చంద్రశేఖర్ రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈ రాజ్‌కుమార్ తదితరులున్నారు.

అటల్‌బిహారీ వాజ్‌పేయికి నివాళి



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి సందర్భంగా బుధవారం బీజేపీ కార్యాలయంలో నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భోగ శ్రావణి మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఎన్నో విజయాలు సాధించిన ఘనత వాజ్‌పేయిదేనని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వీరబత్తిని అనిల్, డా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి చిత్రపటానికి భారత్‌సురక్షా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: మాజీ ప్రధానమంత్రి దివంగత వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చెట్లపల్లి సుఖేందర్, శీలం వేణు, సురభి నవీన్, బొడ్ల రమేశ్ తదితరులున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ధర్మపురి: ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ మండల, పట్టణశాఖ అధ్యక్షులు సంగెపు గంగారాం, బెజ్జారపు లవన్‌కుమార్ డిమాండు చేశారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో బుధవారం బస్తీబాట చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి వివరించారు. గత ఎన్నికల్లో రాష్ట్రప్రభుత్వం అర్హులైన వారికి డబుల్‌బెడ్‌రూం, దళితబంధు, మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి మాట మార్చిందన్నారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జి మర్రిపెల్లి సత్యం, నాయకులు పాల్గొన్నారు.

'బడుగు బలహీన వర్గాలను మోసం చేస్తున్న ప్రభుత్వం'

గొల్లపల్లి: పదేళ్లుగా సంక్షేమ పథకాల పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలను మోసం చేస్తుందని బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం అన్నారు. పల్లెబాటలో భాగంగా గొల్లపల్లి, లొత్తునూర్‌లో డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు వెంకటేష్, భూమయ్య, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు, బీసీ బంధు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, అర్హులందరికీ పథకాలను వర్తింప జేయాలని బుధవారం పెగడపల్లి తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనసూర్య, బాబు, మోహన్ రెడ్డి, భీమన్న, గట్టన్న తదితరులు పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం

సారంగాపూర్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల అర్చక, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి మధుకుమారాచార్యులు నియమితులయ్యారు. బుధవారం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆర్. గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా పి. నర్సయ్య, ఉప ప్రధాన కార్యదర్శిగా బి.గోపాల్‌శర్మ, సంయుక్త కార్యదర్శిగా కె. రాజేందర్, కోశాధికారిగా సి. సత్యనారాయణ, ప్రచార కార్యదర్శులుగా కె. రవీందర్, ఆర్. రమేశ్ శర్మ, సహాయ ప్రచార కార్యదర్శిగా వి. శివకుమార్‌ను నియమించారు.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడిగా ప్రకాశ్

కోరుట్ల: పట్టణ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా కల్వకోట చంద్రప్రకాశ్, ఉపాధ్యక్షులుగా చింత సురేష్, తిరునగరి రమణ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా కల్వకోట శ్రీనివాస్,కార్యదర్శిగా నారాయణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నిరవధిక సమ్మెలో సెకండ్ ఏఎన్‌ఎంలు



సమ్మెలో పాల్గొన్న రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి రాత పరీక్షలు లేకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల మధురిమ డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ గత పది రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందం రాకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించిన ఏఎన్‌ఎంలు తమ డిమాండ్లు సాధించుకునే వరకు సమ్మె ఆపేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, ఎలిజబెత్, రాజమణి, మధులత, రెండో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కుల సంఘాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మేడిపల్లిలో ప్రొసీడింగ్‌లు అందిస్తున్న సంజయ్

మెట్‌పల్లి రూరల్: కుల సంఘాల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కుల సంఘాల భవనాలకు మంజూరైన ప్రొసీడింగ్ పత్రాలను బుధవారం ఆయా సంఘాల నాయకులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కుల సంఘ భవనాలు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. కుల సంఘాలకు బీఆర్‌ఎస్ పాలనలోనే ఆత్మ గౌరవం దక్కిందన్నారు. అలాగే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ మెట్‌పల్లి మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్‌లు తిరుపతిరెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ ఎంపీటీసీ గంగాధర్,నాయకులు రాజాగౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందిస్తాం

మల్లాపూర్: అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకంలో ఇళ్లు అందిస్తామని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్టాపూర్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గృహలక్ష్మి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్నిగ్రామాల నుంచి పెద్దఎత్తున లబ్ధిదారులు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టినట్లు తెలిపారు. అర్హులందరికీ ప్రజాప్రతినిధులు, నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేే, సర్పంచ్ కడకంట్ల సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మి, ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డుసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం దోహద పడుతుందని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. బుధవారం పొరండ్ల, అనంతారం గ్రామాల్లో విచారణ చేపట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గంగాధర్, సర్పంచులు సంధ్యారాణి, దమ్మని విజయలక్ష్మి, ఎంపీటీసీ ఆరె సౌజన్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి శివారులో బుధవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి పడిపోవడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన చింతల నరేష్ బైక్‌పై కోరుట్ల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఇప్పపెల్లి శివారులో వర్షానికి రోడ్డు కోతకు గురై ఇరుకుగా మారడంతో అదుపుతప్పి పడిపోయారు. స్థానికులు గమనించి చికిత్సకోసం కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. కోరుట్ల– వేములవాడ డబుల్ రూట్‌లో వర్షం వల్ల రోడ్డు కోతకు గురైనప్పటికీ మరమ్మతులు చేయించకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు.

'విద్యార్థి మరణంపై విచారణ జరపాలి'

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ న్యూ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అరవింద్ మృతిపై విచారణ జరపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నూనావత్ భీం బుధవారం డిమాండ్ చేశారు. విద్యార్థి మరణంపై అనుమానాలు ఉన్నాయని, దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు.

విద్యార్థినికి సన్మానం

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ హెచ్ఈసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఉమ్మెకుల్సుంను సమాజ్‌వాదీ పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. ఉమ్మెకుల్సుం ఉర్దూ మీడియం ఇంటర్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలవగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ యాస్మిన్ బాషాతో ప్రశంసాపత్రం అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చందం రాజేష్, అధ్యాపకులు,సమాజ్‌వాదీ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రషీద్‌ఖాన్, విద్యార్థినిని అభినందించారు.

ఆటలతో మానసిక ఉల్లాసం

మల్యాల: నిత్యం విధుల్లో మునిగితేలుతున్న సిబ్బందికి ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని మల్యాల ఏడీఈ సీహెచ్.బాలలింగం అన్నారు. మల్యాల, కొడిమ్యాల మండలాలకు చెందిన నాలుగు సెక్షన్ల విద్యుత్ సిబ్బందికి క్రికెట్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ విజేతగా రామన్నపేట సెక్షన్ పరిధి సిబ్బంది నిలువగా, పూడూరు సెక్షన్ సిబ్బంది రన్నరప్‌గా నిలిచారు. విజేతలకు ఏడీఈ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ కొమ్ము కమలేశ్వర్, వి.శ్రీనివాస్, రఘునాథ్, శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ పరిధిలో రూ.99.98 లక్షల రుణమాఫీ

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు ప్రభుత్వం పంట రుణాల మాఫీ పథకం కింద రూ.99,98,579 మాఫీ అయినట్లు విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి, సీఈవో ఎండీ. ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ సంఘ పరిధిలోని 15 గ్రామాల్లోని 163 మంది రైతులకు ప్రభుత్వం ప్రస్తుతం రూ. 99,999 వరకు రుణమాఫీ అమలు చేసిందని వెల్లడించారు. సమావేశంలో విండో సిబ్బంది భూమేష్, శివ, వరుణ్ ఉన్నారు.

జిల్లా సైన్స్ అధికారికి సన్మానం

కోరుట్ల: జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ ను తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేషన్ విజయవంతానికి శ్రీనివాస్ చేసిన కృషికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తపస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గాడిపెల్లి అంజయ్య, దాసరి రమేశ్, అందె శివప్రసాద్, జుంబర్తి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ బంధు చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు బీసీబంధు చెక్కులను, కులసంఘాలకు మంజురైన నిధుల ప్రొసీడింగ్‌లను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పంపిణీ చేస్తారని ఎంపీపీ జాజాల భీమేశ్వరి బుధవారం ఓ ప్రకటనతో తెలిపారు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని కోరారు.

గాంధీ చిత్రం చూసిన విద్యార్థులు

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కోరుట్ల పట్టణంలోని కిన్నెర థియేటర్‌లో గాంధీ చిత్రాన్ని చూసేందుకు బుధవారం వెళ్లారు. పాఠశాలలో చదువుతున్న 260 మంది విద్యార్థులను కోరుట్లకు తీసుకెళ్లి గాంధీ చిత్రాన్ని చూపించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల: తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో ఈ నెల 19న తపస్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నా పోస్టర్‌ను బుధవారం తపస్ నాయకులు ఆవిష్కరించారు. మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల తపస్ అధ్యక్ష, కార్యదర్శులు గాడిపెల్లి అంజయ్య, దాసరి రమేశ్, అందె శివప్రసాద్, పిస్క రమేష్, బాజోజి శ్రీనివాస్, కృష్ణమోహన్‌రావు, మోహన్, పాల్గొన్నారు.

కొండగట్టు హుండీ లెక్కింపులో దొంగతనం?

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 9 న హుండీల లెక్కింపులో చోరీ జరిగిందని బోర్డు సభ్యుడు సురేందర్ బుధవారం ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశారు. హుండీ లెక్కిస్తుండగా ఆలయ ఫౌండర్ ట్రస్టీ తిరుకోవెళూర్ మారుతి స్వామి హుండీలో బంగారం లేదా వెండి వస్తువులను బయటకు తీసుకువెళ్లారని ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.